ప్రజాశక్తి
మంగళవారం 8 జులై 2025
5
విజయనగరం

500 ఎకరాల్లో ఉద్యాన మొక్కలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 500 ఎకరాల్లో ఉద్యాన మొక్కల్ని నాటనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో ఉన్న ఎస్‌సి/ఎస్‌టి, చిన్న/సన్న కార (ఐదు ఎకరాలు లోపు భూమి ఉన్న) రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాకు 2,500 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించారని తెలిపారు. తెలిపారు. అందలో భాగంగా 500 ఎకరాల పండ్ల తోటలు పెంపకం కోసం ఈనెల 8 న సుమారు 477 మంది రైతుల భూముల్లోను, చెరువు గట్లపైనా భారీ ఎత్తున పండ్లతోటల పెంపకంలో భాగంగా 592 ఎకరాలలో మామిడి, జీడిమామిడి, కొబ్బరి, సపోటా, జామ మొదలగు 23 రకాల పండ్ల తోటలు మొక్కలు వేసేందుకు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఎంపిడిఒలు, ఎపిఒలు పర్యవేక్షించాలని తెలిపారు.

ఎమ్మెల్యే అదితి పనితీరు బాగోలేదు

- కలెక్టరేట్‌లో టిడిపి కార్యకర్త ఫిర్యాదు
- ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదంటూ విమర్శ
- సీనియర్లను పక్కనబెట్టి రాజేష్, బేగం కనుసన్నల్లో పాలిస్తున్నారంటూ ఆవేదన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు పనితీరు బాగోలేదంటూ టిడిపికి చెందిన 28వ వార్డు కార్యకర్త (ఐడి నెంబర్ 19690702 - 2024 -2026) తీగెల ఆనందరావు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనికి ముందు 28వ వార్డులోని ప్రజా సమస్యలతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ కలెక్టరేట్ ఔట్ గేటు ఎదుట నిరసన తెలిపారు. ప్రజా సమస్యలను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని, పార్టీ సీనియర్ నాయకులను కూడా పక్కనబెట్టి ఒకరిద్దరి కనుసన్నల్లో పాలన, పార్టీ కార్యకలాపాలు సాగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వరుసగా రెండోసారి ఫిర్యాదు చేయడంతో చర్చనీయాంశంగా మారింది. ఆనందరావు ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

'అదితి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించి ఏడాది కావస్తున్నా విజయనగరంలో ఒక్క వార్డు పర్యటన కూడా చేయలేదు. దీంతో, కార్పొరేషన్ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ చాలా ప్రజా సమస్యలు వెంటాడుతున్నాయి. తాగునీరు, డ్రైనేజి, ఎలిమెంట్రీ స్కూల్స్ రిపేర్లు హాస్పటల్ మెయింటెనెన్స్, పైపులైన్ వర్కు, రేషన్ డిపోలు రక రకాల ప్రజా సమస్యలపై ప్రజా దర్బారులో ఫిర్యాదు చేసినా ఏ ఒక్కటీ పరిష్కరించలేదు. నేను కూడా ఏడాదిలో ప్రజా సమస్యలపై 8సార్లు వినతులు అందించాను. అయినా న్యాయం జరగలేదు. ఎమ్మెల్యేగా గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేశాం. కష్టపడిన నాయకులను పట్టించుకోవడం లేదు. చివరకు సీనియర్ నాయకులకు, ఇన్చార్జులకు, వార్డు నాయకులకు కూడా విలువ లేకుండా పోయింది. తమకంటూ పెద్ద దిక్కుగా ఉన్న టిడిపి సీనియర్ నాయకులు ఐవిపి రాజు మాటలు కూడా అశోక్ బంగ్లాలో చెల్లుబాటు కావడం లేదు. అనూరాధ బేగం, రాజేష్ కనుసైగల్లో విజయనగరం నియోజకవర్గాన్ని నడిపిస్తున్నారు. అశోక్ బంగ్లానే టిడిపి కార్యాలయం కావడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమౌతోంది. కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ఇప్పటికైనా చొరవ చూపాలి.

ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న టిడిపి కార్యకర్త ఆనందరావు

సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

- సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ
- దేశభక్తి యుత సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 9న అఖిలపక్ష కార్మిక సంఘాలు చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు, రైతులు వ్యవసాయ కార్మికులు చేసే గ్రామీణ హర్తాళ్లకు సిపిఎం జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. సోమవారం ఎల్‌బిజి భవనంలో జరిగిన విలేకర్ల సమావేశంలో సమ్మె గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో కార్మికులు పోరాడి చట్టాలను సాధించుకున్నారని తెలిపారు. 8 గంటల పని దినం కోసం వేలాదిమంది కార్మికులు జైలుకు వెళ్లి , రక్తాన్ని చిందించారని గుర్తు చేశారు. బిజెపి అధికారాన్ని చేపట్టిన 11 ఏళ్లలో కార్మిక చట్టాలను, హక్కులను హరించిందని అన్నారు. మోడీ విధానాలు కార్మికులకు ఉరితాళ్ళులా మారాయని అవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉపయోగపడే 44 చట్టాలను, నాలుగు లేబర్ కోడ్లుగా మార్చారని అన్నారు. ప్రపంచ దేశాల్లో పనిగంటలు తగ్గించడం కోసం ప్రయత్నం జరుగుతుంటే దీనికి భిన్నంగా భారతదేశంలో మోడీ ప్రభుత్వం పని గంటలను 10,12 గంటలకు పెంచి పెట్టుబడిదార్ల దగ్గర కార్మికులను తాకట్టుపెట్టే విధానాలను అవలంభిస్తు న్నా డని అన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన గత వైసిపి ప్రభుత్వం గాని, ప్రస్తుతం రూలింగ్ లో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వంగాని కేంద్రంలో మోడీ ఆడుతున్నట్లు అదానీలకు, అంబానీలకు అనుకూలంగా గంతులు వేస్తున్నారని, ఎవరూ ప్రజల కోసం,కార్మికుల కోసం పని చేయడంలేదని అన్నారు. ఏ రంగంలోనూ ఉద్యోగులకు పరి గ్యారెంటీ లేకుండా పోయిం దన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను మూసివేసి ప్రైవేట్ రంగానికి పెద్దపీటవేస్తున్నారని అన్నారు. ప్రైవేట్ రంగం సామాజిక న్యాయాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఈనేపథ్యంలో జరుగు దేశ్వాప్త సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. ప్రజలు , కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, నాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సమ్మెలో పాల్గొనండి

4 లేబర్ కోడ్లు రద్దు తో పాటు మోటార్ వాహన చట్టం 2021, భారత న్యాయ సంహిత చట్టాలను రద్దు చేయాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాల,అచ్చుతాపురంలో ఏర్పాటు చేసిన వేదాంత ప్రైవేట్ ఫిట్నెస్ సెంటర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ కార్మికులు డ్రైవర్లు, యజమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కో కన్వీనర్ ఎ. జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. సమ్మె ప్రచారంలో భాగంగా సోమవారం హుకుంపేట లో ఉన్న లారీ ఆఫీస్ వద్ద డ్రైవర్ల తో సమావేశం నిర్వహించి గోడ పత్రికను ఆవిష్కరించారు. గాజులరేగ, కోట, బాలాజీ జంక్షన్, దాసన్నపేట, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర చోట్ల ఆటో డ్రైవర్లను సమ్మెలో పాల్గొనాలని కరపత్ర ప్రచారం నిర్వహించారు. లారీ యూనియన్ నాయకులు శ్రీను, పైడ్రాజు ,మారయ్య, ఆటో యూనియన్ నాయకులు విజ్జి ,లక్ష్మణ్ , గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌కు 194 వినతులు

సరిగా స్పందించని అధికారులకు షో కాజ్ నోటీసులు : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట, కంటోన్మెంట్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులకు నాణ్యమైన సమాధానాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబెద్కర్ తెలిపారు. గడువు దాటి ఉన్న వినతులు 5 ఉన్నాయని, ఆయా అధికారులకు కారణాల పై ఆరా తీశారు. సోమవారం పిజిఆర్ఎస్ లో కలెక్టర్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని, అలాగే రీ ఓపెన్ కేసులు కూడా పూర్తిగా విచారణ జరిపి ముగించాలని తెలిపారు. ఆడిట్ లో కూడా పెండింగ్ లేకుండా చూడాలని, గడువు లోపలే వినతులకు సమాధానాలు పంపాలని ఆదేశించారు.

సోమవారం పిజిఆర్ఎస్ కు 194 వినతులు అందాయి. కలెక్టర్ తో పాటు సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్ మురళి, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 194 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంభందించి రెవిన్యూశాఖకు అత్యధికంగా 97వినతులు అందాయి.

నా కుమార్తెకు పెన్షన్ ఇప్పించండి

తన కుమార్తెకు పింఛను ఇప్పించాలని రాజాం నగర పంచాయతీ పోనుగుట్టువలసకు చెందిన జల్ల సృజన తల్లి మల్లేశ్వరి గ్రీవెన్స్‌లో అధికారులను కోరింది. తన పాప పుట్టినప్పటినుంచి అంగవైకల్య ంతో పాటు మాట సరిగా రాదని, ఆకలేస్తే ఏడుస్తుంది తప్పమరి ఏమీ చెప్పలేదని వాపోయింది. పదేళ్ల ఎదురు చూసి గత ఏడాది అంగవైకల్యం సర్టిఫికెట్ చేయించామని తెలిపింది. ఇప్పటికైనా మా పాపకు పెన్షన్ ఇప్పించాలని కోరింది.

అడ్డుగోలుగా ఆశీలు చేస్తున్నారు

అలమండ సంతలో అటుగోలుగా ఆశీలు వసూలు చేస్తున్నారని పెదవేమలి సర్పంచ్ వర్రి పాపినాయుడు వినతి అందజేశారు. సంతలో ఇష్టారాజ్యంగా ఆశీలు వసూలు చేస్తూ దౌర్జన్యం చేస్తున్నారని, వారిపై చర్య తీసుకోవాలని కోరారు.

బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

బాధితుల సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్‌జిందాల్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి 40 ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 13, కుటుంబ కలహాలకు సంబంధించినవి 4, మోసాలకు పాల్పడినట్లు 5, ఇతర అంశాలకు సంబంధించినవి18 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.


నీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

మడ్డువలస నీరు విడుదల

ప్రజాశక్తి - వంగర

గొర్లె శ్రీరాములునాయుడు మడ్డువలస ప్రాజెక్టు ఆయకట్టుకు ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మడ్డువలస కుడి ప్రధాన కాలువ నుంచి సోమవారం ఆయన నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు వద్ద ముందుగా ఇఇ పొన్నాడ సుధాకర్ రావును ప్రాజెక్టు పరిస్థితి పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. క్రమేపి పెంచుతామని స్టేజ్1లో వంగర, రేగిడి, సంతకవిటి, జి.సిగాడాం, పొందూరు మండలాలకు 24,877 ఎకరాలకు, స్టేజ్2లో లావేరు మండలానికి సంబంధించి 5,200 ఎకరాలకు కలిపి మొత్తం 30,077 ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మడ్డువలస ప్రాజెక్టు డిఇపి అర్జున్, నాయకులు గురాన నారాయణరావు, లచ్చుబుక్త కృష్ణమూర్తి, ధనలక్ష్మి, బి.వాసుదేవ రావునాయుడు, పిన్నింటి మోహనరావు, పైల వెంకటరమణ, ఎం.గణపతి ప్రాజెక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో హెల్త్ కార్యదర్శులు, ఎఎన్ఎంలు సంయుక్తంగా నగరంలో ఫీవర్ సర్వే చేపడుతున్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వర పీడితులు ఉన్నారా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసు కుంటున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపద్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. దీనిపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఫీవర్ సర్వేలను చేపడుతున్నట్లు చెప్పారు. వైరస్ సోకిన జ్వరం అయితే తక్షణమే వైద్యుణ్ణి సంప్రదించాలని చెప్పారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పూసపాటిరేగపై విఎంఆర్‌డిఎ ఫోకస్

- అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళిక
- జి-హబ్ పేరుతో భూ సర్వే ప్రారంభం
- భవిష్యత్ మాస్టర్ ప్లాన్ 2051 దిశగా అడుగులు

ప్రజాశక్తి -పూసపాటిరేగ

పూసపాటిరేగ మండలం భవిష్యత్‌లో బహుళ అభివృద్ధి కేంద్రాలకు కేంద్ర బిందువుగా మారబోతున్నదా? విశాఖపట్నం మాదిరి రూపుదిద్దుకోనుందా? అన్న సందేహాలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. ఎందుకంటే విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి సంస్థ (విఎంఆర్‌డిఎ) 2041-2051 మాస్టర్ ప్లాన్ ప్రకారం పూసపాటిరేగ మండలాన్ని రెండో అభివృద్ధి కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ ప్రణాళికలో భాగంగా ఇప్పటికే పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో గ్రోత్ హబ్ (జి-హబ్) పేరుతో విస్తతంగా భూ సేకరణ (ల్యాండ్ పూలింగ్) చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం, జాతీయ రహదారి అనుసంధానం, సముద్రతీరం వంటి అంశాల నేపథ్యంలో ఈ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని స్పష్టమవుతోంది.

ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న విఎంఆర్‌డిఎ అధికారులు

జి- హబ్ పేరుతో భూ సర్వే

ఇటీవల పూసపాటిరేగ మండలంలోని చోడమ్మ అగ్రహారం, కొప్పెర్ల, పూసపాటిరేగ గ్రామాల్లో విఎంఆర్‌డిఎ అధికారులు గ్రోత్‌హబ్ పేరుతో భూ సర్వేలు నిర్వహించి, సుమారుగా 120 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఈ పరిశీలనలో విఎంఆర్‌డిఎ కార్యదర్శి విశ్వనాథ్, విజయనగరం ఆర్‌డిఒ తదితర అధికారులు పాల్గొన్నారు. భోగాపురం, డెంకాడ మండలాల్లో కూడా సర్వేలు జరిగాయి. భవిష్యత్తులో అవసరాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే భూ సేకరణకు విఎంఆర్‌డిఎ సిద్ధమవుతోంది.

మాస్టర్ ప్లాన్ సిద్ధం

పూసపాటిరేగ ప్రాంతంలో తక్కువ జనసాంద్రత, ఎక్కువ ఖాళీ భూములు, నివాసయోగ్య వాతావరణం ఉండటంతో అభివృద్ధికి ఇది అనుకూలంగా మారుతోంది. వీటిని అనుసరించి హౌసింగ్ టౌన్‌షిప్‌లు,కమర్షియల్ హబ్‌లు, పర్యాటక ప్రాజెక్టులు, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి వంటి అంశాలను 2041-2051 మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించారు. విశాఖపట్నం జనాభా 2051 నాటికి 2 కోట్లను దాటే అవకాశం ఉండటంతో నగరంపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యామ్నాయ అభివృద్ధి కేంద్రాల అవసరం పెరిగింది. అదే దిశగా పూసపాటిరేగ అభివృద్ధి ఒక కీలక భూమిక పోషించనుంది. విఎంఆర్‌డిఎ చేపడుతున్న ప్రణాళికలు కార్యరూపం దాలిస్తే, పూసపాటిరేగ మండలం త్వరలోనే విశాఖపట్నానికి పక్కన మరో అభివృద్ధి కేంద్రంగా నిలవడం ఖాయమని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

భూ సర్వే చేశారు

జి -హబ్ కోసం విఎంఆర్‌డిఎ అధికారులు మండలంలో భూ సర్వే చేసారు. సుమారుగా 120 ఎకరాలు డి. పట్టా, ప్రభుత్వ భూములు గుర్తించారు. డెంకాడ, భోగాపురంలో కూడా సర్వే జరిగింది.

- సంజీవ్ కుమార్, ఉప తహశీల్దార్, పూసపాటిరేగ

ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు బేసిక్ వేతనం రూ.21వేల నుంచి రూ.24,500 అమలు చేయాలని, 17 రోజులు సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద వద్ద సి ఐ టి యు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు ధర్నా నిర్వహించారు.ధర్నాను ఉద్దేశించి సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీరు అందించడంలో పర్యావరణాన్ని కాపాడుకోవడంలో, వీధి దీపాల నిర్వహణలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు విస్తతమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. కానీ ఇంజనీరింగ్ ,నాన్ పిచ్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతందన్నారు. రూ.11 వేలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారన్నారు. జీవో 30 ప్రకారం బేసిక్ వేతనం రూ.21వేలు నుంచి రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.విలీన ప్రాంతాల్లో పని చేస్తున్న కార్మికులను కార్పొరేషన్ కార్మికులుగా గుర్తించాలన్నారు. పిఎఫ్., ఈ ఎస్. ఐ అమలు చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ప్రజా పిర్యాదులు పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి అందజేశారు.ధర్నా లో ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో వేధిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పూసపాటిరేగ

పనిచేసే చోట మహిళలను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం కందివలసలో ఎస్ఎంఎస్ ఫార్మస్యూటికల్ కంపెనీలో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పనిచేసే ప్రతి చోట మహిళల కోసం ఒక కమిటీ ఉంటుందని, ఆ కమిటీలో వారి ఫిర్యాదులను తెలియజేయవచ్చని తెలిపారు. లైంగిక వేధింపులకు గురైనట్లయితే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 సంప్రదించవచ్చునని చెప్పారు. మహిళలకు ఉచితంగా న్యాయ సహాయం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందిస్తుందని తెలిపారు. మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులను సంబంధిత కమిటీకి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో కంపెనీలో పనిచేస్తున్న మహిళలు, భోగాపురం సిఐ రామకృష్ణ, స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ చంద్ర భాయ్ పాల్గొన్నారు.

పౌర సేవలు సరళతరానికి పురమిత్ర

రాష్ట్ర పురపాలక అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ సంపత్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పౌర సేవలను మరింత సరళతరంగా అందించాలన్నదే పురమిత్ర-మనమిత్ర యాప్ ల ఉద్దేశమని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ కుమార్ అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలను విశదీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా నేరుగా పౌర సేవలు పొందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశమని, అందులో భాగంగానే ఎంతో ప్రతిష్టాత్మకంగా వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చారని చెప్పారు. పురమిత్ర - మనమిత్ర యాప్ ద్వారా ప్రజల ముంగటికే పౌర సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. పురమిత్ర ద్వారా ప్రజలు ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. మన మిత్ర ద్వారా ప్రభుత్వ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల ఇటువంటి నూతన విధానాల పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో కమీషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, ఈఈ ప్రసాద్, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కమిషనర్ నల్లనయ్య, ఇతర అధికారులు

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను ఉపేక్షించేది లేదు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన ఏ నిర్మాణాలనైనా ఉపేక్షించబోమని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది నగరంలోని డబుల్ కాలనీలో ప్రహరీ గోడను కూల్చివేశారు. డబుల్ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఒక వ్యక్తి ప్రహరీ గోడ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రణాళిక అధికారులకు ఆదేశించారు. దీంతో అక్కడికి చేరుకున్న ప్రణాళిక సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు ప్రభుత్వ స్థలంలో నిర్మాణం జరుగుతున్నట్లు గుర్తించారు.వెంటనే జెసిబి సహాయంతో ప్రహరీ గోడను కూల్చివేశారు. ం

సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఎస్‌టి సెల్

ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి ప్రతిపాదన
వెంటనే ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా కేంద్రంలో ని సర్వ జన ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఎస్‌టి సెల్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా వైద్యాధికారికి ఆదేశించారు.రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు జిల్లా కలెక్టర్ ను సోమవారం కలిసారు. ఈ సందర్భంగా కమిషన్ సూచన మేరకు రాష్ట్రంలో వివిధ జిల్లా ల సర్వజన ఆసుత్రులలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనుల వైద్య సహాయం కోసం ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేశారని తెలిపారు. విజయనగరం జిల్లాలో కూడా ఎస్‌టి సెల్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి జిల్లా వైద్యాధికారికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామని డిఎంహెచ్ఒ జీవనరాణి తెలిపారు. జిల్లాలో గిరిజన బాలికా విద్యను ప్రోత్సహిస్తూ అవసరమైన ప్రాంతాల్లో మరికొన్ని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత వుందని కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు తెలిపారు. బొబ్బిలి డివిజన్‌లో ఆర్‌ఎఫ్ఆర్ పట్టాలు అందజేయాల్సి వుందని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. జిల్లాలో పలు గిరిజన సంక్షేమ పథకాల అమలు తీరు, మౌలిక సదుపాయాల కల్పన, గిరిజన యూనివర్సిటీ లో నిర్మాణాల స్థితి తదితర అంశాలపై ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కలెక్టర్ డాక్టర్ అంబేద్కర్ తో చర్చించారు.

10న రికార్డు స్థాయిలో మెగా పిటిఎం

తల్లితండ్రులు ఇద్దరినీ ఆహ్వానించాలి
కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్/కంటోన్మెంట్

ఈ నెల 10వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సారి రికార్డు స్థాయిలో జరిగే ఈ సమావేశాలకు తల్లితండ్రులు ఇద్దరినీ ఆహ్వానించాలని సూచించారు. ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రికార్డు స్థాయిలో జరిగే ఈ సమావేశాల్లో ప్రయివేటు విద్యాసంస్థలన్నీ భాగస్వాములు కావాలని కోరారు. 10 వ తేదీ ఉదయం 9 నుండి 1 గంట వరకు అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహించాలని సూచించారు. గత ఏడాది ప్రభుత్వ పాఠశాల్లల్లో మాత్రమే ఉండేదని, ఈ ఏడాది ప్రయివేటు వారిని కూడా భాగస్వాములను చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. హాజరయ్యే ప్రతి విద్యార్థి, ప్రభుత్వం ఇటీవల సరఫరా చేసిన యూనిఫారాన్ని విధిగా ధరించేలా చూడాలన్నారు. జిల్లాకు చెందిన సివిల్ సర్వీస్ అధికారులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, విజయవంతమైన వ్యక్తులు, స్ఫూర్తిదాయకులు, అధికారులను సమావేశాలకు ముఖ్య అతిధులుగా ఆహ్వానించాలని సూచించారు. విద్యార్దులు తమ తల్లిపేరుతో ఒక మొక్కను తల్లులచేత నాటించి, వాటిని సంరక్షించేలా ప్రేరేపించాలని చెప్పారు. ఈ సమావేశాలను గిన్నిస్ బుక్‌లో నమోదు చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, సిపిఒ పి.బాలాజీ, డిఇఒ మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ రామారావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ కవిత తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు బంగారు కుటుంబాల దత్తత పూర్తికావాలి

పి4 కార్యక్రమంలో భాగంగా వెంటనే మార్గదర్శులను గుర్తించే ప్రక్రియను మొదలు పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. గుర్తించిన వెంటనే బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, తాహశీల్దార్లు, ఎంఇఒలు, హెడ్‌మాస్టర్లతో కలెక్టర్ తమ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే సర్వే నిర్వహించి 67,066 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. అత్యధికంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 6,776, తక్కువగా ఎల్.కోటలో 1221 కుటుంబాలు ఉన్నాయని చెప్పారు. ఈ కుటుంబాలన్నిటినీ దత్తత తీసుకునేందుకు మార్గదర్శులను గుర్తించాలని అన్నారు. ఆయా బంగారు కుటుంబాలు పేదరికం నుంచి బయటపడేందుకు వీలుగా వారి అవసరాలను గుర్తించి, మార్గదర్శులు వాటిని తీర్చేవిధంగా చైతన్యపరచాలని సూచించారు. ఈ దత్తత ప్రక్రియ కూడా ఆన్‌లైన్లోనే జరగాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ముఖ్యంగా గెజిటెడ్ ఉద్యోగులంతా ఇదొక సామాజిక బాధ్యతగా భావించి, బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం

బొబ్బిలి: మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని డిఎస్‌పి భవ్యరెడ్డి అన్నారు. స్థానిక అభ్యుదయ పాఠశాలలో సోమవారం సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాలతో యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వాడిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నాని, ప్రిన్సిపాల్ చింతా శారదా పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించరాదు

నెల్లిమర్ల: మండలంలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు దుకాణాలు నిబంధనలు అతిక్రమించరాదని ఎడిఎ ఎస్ కోటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ కోటేశ్వరరావు మాట్లాడుతూ డీలర్లు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు నాణ్యతతో కూడినవి ఇవ్వాలన్నారు. అధిక రేట్లకు అమ్మడం, బ్లాక్ చేయడం, వంటివి చేయరాదని కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రసీదు ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్లు నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఒ శ్రీలక్ష్మి, డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా పశుగ్రాస వారోత్సవాలు

వేపాడ: ఏటా జులై 7 తేదీ నుంచి 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవాలు జరుపుకున్నామని ఇందులో భాగంగా వావిలపాడు గ్రామంలో ఉచిత పశు గర్భకోశ ఆరోగ్య శిబిరం నిర్వహించి పశువులకు సేవలు అందించామని పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి తెలిపారు. పాడి రైతులకు పశుగ్రాసం పెంపకం వల్ల కలిగే లాభాలు, పశుగ్రాస ప్రాముఖ్యత మీద అవగాహన కల్పించినట్లు తెలిపారు. శిబిరంలో వేపాడ పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

సంతకవిటి: మండలంలోని కావలి గ్రామంలోని పారిశుధ్య పనులను సోమవారం ఎంపిడిఒ కె.సురేష్ కుమార్ పరిశీలించారు. ఈ మేరకు 'వ్యాధుల సీజన్ వచ్చేసింది' అనే ప్రజాశక్తి కథనానికి స్పందిస్తూ గ్రామంల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వ్యాధుల సీజన్ వచ్చేసింది కనుక పారిశుధ్య పనులు ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. మురికి నీటి కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తమ్మినేని రవీంద్రనాయుడు, పంచాయతీ సెక్రెటరీ సి.హెచ్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మేన్ కుటుంబానికి ఆర్థిక సాయం

శృంగవరపుకోట: జామి మండలంలోని లొట్లపల్లికి చెందిన జూనియర్ లైన్‌మెన్ షేక్ రహమాన్ ఇటీవల విద్యుత్ ఘాతుకానికి గురై మృతి చెందిన విషయం విదితమే. రహమాన్ కుటుంబ సభ్యుల ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని ఎపి ఈఈయు 1104 యూనియన్ తరుపున విద్యుత్ ఉద్యోగులు రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని రెహమాన్ కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ సెక్రెటరీ ఎస్ లక్ష్మణ్, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంగునాయుడు, రీజనల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పైడిరాజు, రూరల్ బ్రాంచ్ సెక్రెటరీ దేముడు, వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పలనాయుడు, ఆఫీస్ సెక్రెటరీ అప్పారావు, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

బొబ్బిలి: స్థానిక కోటలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. ప్రజలు, రైతుల నుంచి ఎమ్మెల్యే బేబినాయన వినతులు స్వీకరించారు. సాగునీరు, తాగునీరు, రోడ్లు, కాలువల సమస్యలు పరిష్కరించాలని రైతులు, ప్రజలు వినతులు అందజేశారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని సంబంధించిన అధికారులను బేబినాయన ఆదేశించారు. బొబ్బిలి నియోజకవర్గంలో 4,500 మామిడి, జీడి మామిడి మొక్కలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన ఎపిఎం వివరించారు.

వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో పరిశుభ్రత

కొత్తవలస: వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో ఆసుపత్రి సిబ్బంది, పంచాయతీ సిబ్బంది కలిసి పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమం నడుంబిగించారు. వైద్యాధికారి గోపాలకృష్ణ ఆదేశాల మేరకు, పంచాయతీ సెక్రెటరీ శాంతికుమారి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, పిహెచ్‌సి సిబ్బంది కలిసి ఆయా ప్రదేశాలలో పూడిక తీత, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో క్లీనింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్స్ దగ్గర క్లీనింగ్, క్లోరినేషన్, సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, పచ్చ కామెర్లు, డెయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరరావు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ సత్తారావు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పంచాయతీ, హెల్త్ డిపార్ట్మెంట్, రూరల్ వాటర్ సప్లై సిబ్బంది సమన్వయంతో పని చేస్తే ప్రజలని వ్యాధులు బారినుండి కాపాడ వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పి ధన లక్ష్మి, ఎఎన్ఎమ్ గౌరీ, ఆశ వర్కర్ రేవతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఆర్‌పిలకే ఎరువులు అమ్మాలి

దెంకాడ: ఎరువుల దుకాణాల యజమానులు ఎరువులను ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని వ్యవసాయాధికారి టి.సంగీత తెలిపారు. ఎరువుల దుకాణాలు తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని ఉన్న సాయిశ్రీనివాస ఎరువుల షాపును ఆమె సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువుల అమ్మే యజమానులు ఎక్కువ ధర ఉన్న రేట్లకి అమ్మితే లైసెన్సులు రద్దు చేయడమే కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో పాటు ఎంపిఇఒ రామకోటి ఉన్నారు.

పంచాయతీ పురోగతిపై నేడు శిక్షణ

దెంకాడ: పంచాయతీ పురోగతిపై గ్రామ కార్యదర్శులతోపాటు సచివాలయ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ వైభవాని తెలిపారు. ఈ శిక్షణ 10 గంటలకు ప్రారంభమవుతుందని విధిగా కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పలు శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు వైసిపి నియోజకవర్గ సమావేశం

దెంకాడ: నెల్లిమర్ల నియోజకవర్గ వైసిపి విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మినాయుడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పినతాడివాడలో జరగనున్న సమావేశానికి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖరరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ హాజరవుతారని మండలంలో ఉన్న పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపిటిసిలు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

క్షమాపణతోనే శాంతి సాధ్యం

బొబ్బిలి: కోపం, ద్వేషం, ప్రతీకారం ప్రజ్వరిల్లేచోట వాటి మెడలు వంచి శాంతికి బాటలు వేసే ఒకే ఒక్క గొప్ప సుగుణం క్షమా గుణమేనని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. సోమవారం ప్రపంచ క్షమాపణ దినోత్సవం సందర్భంగా కారుణ్య కార్యాలయంలో క్షమా గుణాన్ని ప్రబోధాం జీవన విధానంగా చేసుకోవాలని కోరుతూ గోడ ప్రతిజ్ఞలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ ఎందరో అనర్థాలకు కారణం అవుతున్న కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలనే హీన గుణాలను జయించే ఏకైక గొప్ప గుణం క్షమా గుణం అని అన్నారు. క్షమాగుణం అనే శాంతి, కరుణ, జాలి, దయ, సానుభూతి, త్యాగం, సహనం లాంటి ఉన్నత గుణాలు కలిగి ఉండటమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కారుణ్య సభ్యులు ప్రదీప్ కుమార్, రామకృష్ణ, యుగంధర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల పరిరక్షణకు 11న సమావేశం

వేపాడ: జిల్లాలోని బిఆర్ అంబేద్కర్ గురుకులాల పరిరక్షణ కోసం ఈ నెల 11న ఎస్.కోటలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ భాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలో సమావేశానికి సంబంధించిన గోడపత్రికను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపిసి రేట్లకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన చేయించాలని, కాస్మోటిక్స్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు ఇవ్వాలని తదితర డిమాండ్ కోసం ఎస్.కోటలో గల ఆలీక్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటల నుండి సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు బొంగ ఈశ్వరరావు, కప్పరెడ్డి వెంకట అప్పారావు, మెయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పాల్గొనండి : సిఐటియు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

దేశవ్యాప్త శ్రామికుల సమ్మెలో పాల్గొనాలని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పక్కి, రంగరాయపురం గ్రామాల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి శంకర్రావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు యెస్.గోపాల్ పాల్గొని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 9న సార్వత్రిక సమ్మెలో శ్రామికులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం, విఆర్ఎ, విఒఎ, ఆటో, కళాసిలు, అసంఘటితరంగ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొనాలని కోరారు. బుధవారం ఉదయం 10 గంటలకు వేణుగోపాలస్వామి కోవెల సెంటర్ నుండి జరిగే ప్రదర్శనలో అందరూ పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ నాయకులు యు. ప్రసాద్, యుగామి తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

నెల్లిమర్ల: ఈ నెల 9న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని విద్యుత్ స్టోర్స్ హమాలీలలకు కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలు పరిరక్షణ, ప్రభుత్వ రంగం పరిరక్షణ, కనీస వేతనాలు అమలు, 4 కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ చేపట్టే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ హమాలీ సంఘం నాయకులు పతివాడ లక్ష్మణరావు, కెల్ల గోవిందరావు, మీసాల లెనిన్, పతివాడ పెదరాంబాబు, చిన రాంబాబు, కలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు మండల కన్వీనర్ వై అప్పలస్వామి అన్నారు. ఈ నెల 9న జరుగు సమ్మె జయప్రదానికై స్థానిక మండల కేంద్రంలో వివిధ రంగాల కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు జి.కుమారి, వెంకటరత్నం, ఉదయ్‌కుమార్, దాలప్పడు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: మధ్యాహ్న భోజనం కార్మికులు సమస్యలు పరిష్కరించాలని మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూలు ఆయాలు జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటారని ఎంఇఒ విమలమ్మకు ఎపి మధ్యాహ్న భోజన కార్మిక సంఘం, సానిటేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి 20 రూపాయలు చొప్పున మెనూ ఛార్జ్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల నాయకురాలు సత్యవతి, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పి పైడి రాజు పాల్గొన్నారు.

బొబ్బిలి: జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని పట్టణ కళాసి సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు భోగాది అప్పలస్వామి, పట్టణ కళాసి సంఘం అధ్యక్షులు దంతులూరి వర్మ, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి తదితరులు ఒక ప్రకటనలో కోరారు.

దెంకాడ: జూలై 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా సోమవారం భోగాపురం ఆటోస్టాండ్ వద్ద పోస్టర్ రిలీజ్ చేస్తూ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బి సూర్యనారాయణ కోరారు. ఆ రోజు సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొవాలన్నారు. కేరళ తరహా రవాణాలను, కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మెలో ఆటో కార్మికులంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు ఒనుము, రమణ, బి.చంద్రరావు, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాక పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఈ ఏడాది సంక్షేమంతో పాటుగా అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తామని చెప్పారు. మండలంలోని ముసిరాంలో సుపరిపాలనలో తొలి డుగు క్యాక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ నేతలతో కలిసి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొరపల్లి రాము, మాజీ జెడ్‌పిటిసి కోళ్ల శ్రీను, క్లస్టర్ రత్నాజీ, బొబ్బిలి అప్పారావు మాస్టర్, సర్పంచ్ అప్పల నాయుడు, బంగారు రమేష్, నక్కరాజు చినరాము, తెలుగు యువత కర్రీ చిన్నా, ఉపేంద్ర, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

దెంకాడ: దెంకాడలో సోమవారం టిడిపి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంది చంద్రశేఖర రావు, పల్లె భాస్కర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు, కొయనేని రమణ, కలిదిండి రంగరాజు, దాట్ల విజయరామరాజు, బొంతు కృష్ణ, కొలుసు నరిసింహ, చలుమూరి రమణ, సబ్బవరపు శ్రీను, రొంగలి అప్పారావు, వర్రి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం రూరల్: మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతుంది. సోమవారం కెంగువ, దావాలపేట, గజపతినగరం రైల్వే స్టేషన్ కాలనీ తదితర గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గంట్యాడ శ్రీదేవి, ప్రదీప్ కుమార్, మజ్జి గోవింద, మాజీ సర్పంచ్ ప్రసాద్, వార్డ్ నెంబర్ దాసరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వంగర: గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ఏకకాలంలో చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మడ్డువలస, మగ్గూరు, ఓని అగ్రహారం గ్రామాలలో ఆయన కార్యకర్తలతో కలిసి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటా వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో అందించిన సంక్షేమం అభివృద్ధి గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో పి మోహన్ రావు, వాసుదేవరావు నాయుడు, లచ్చు బుక్త కృష్ణమూర్తి ధనలక్ష్మి, చింత అప్పలనాయుడు, వేగిరెడ్డి కృష్ణ, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం : పథకాలు గురించి వివరిస్తున్న అప్పలనాయుడు

విజయనగరంకోట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని టిడిపి నాయకులు పాశి అప్పల నాయుడు అన్నారు. సోమవారం సుపరి పాలనలో తొలి అడుగులో భాగంగా బడుకొండపేట గ్రామంలో అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అర్హులకు పథకాలు రాకపోతే సంబంధిత అధికారులను కారణాలు అడిగి అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని చెబుతున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బడుకొండ అప్పలనాయుడు, బడుకొండ శ్రీనివాసరావు, బడుకొండ గోపాలం, ముల్లు నారాయణప్పడు, పల్లి నర్సింగ రావు, మామిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలు ఎందుకు?

వైసిపి నాయకులు

చీపురుపల్లి: అధికారంలోనికి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిల్ డీడ్ యాక్టని రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వ నాయకులు గ్రామాలలో ఎందుకు రీ సర్వే చేయిస్తున్నారని వైసిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణలు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. ఎంతో నిబద్ధతతో పనిచేసిన తమ నాయకుడైన బొత్స సత్యనారాయణను మాట్లాడే అర్హత ప్రస్తుత మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు, టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునకు లేదన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం తొలగించడం వల్ల మండలంలో సుమారు 600 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేటు పాఠశాలలకు తరలి వెళ్లారని ఆరోపించారు.

నెరవేరిన కల

బడి బస్సు ప్రారంభం విద్యార్థుల హర్షం

ప్రజాశక్తి - వేపాడ

ఎస్.కోట ఆర్‌టిసి డిపో నుంచి సోంపురం, జాకేరు, చామలాపల్లి, మారిక రోడ్డు, పోతు బందిపాలెం, దబ్బరాజుపేట, వేపాడ మీదుగా బక్కునాయుడుపేట వద్ద గల ఎపి ఆదర్శ పాఠశాలకు బడి బస్సు ఏర్పాటు చేయాలని ఆయా రూట్లలో గల గిరిజన గ్రామాలు, దళిత వాడల ప్రజల ఆకాంక్ష మేరకు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు అలుపెరగని పోరాటానికి సోమవారం ఫలితం దక్కింది. డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దొన్ను దొరల ఆదేశాల మేరకు ఆర్‌టిసి డిపో మేనేజర్ కె. రమేష్ బడి బస్సును ఏర్పాటు చేయగా జిల్లా డిపిటిఒ జి.వరలక్ష్మి, టిడిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, జాకేరు గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు రిబ్బను కట్ చేసి బస్సును ప్రారంభించారు. బడి బస్సు ప్రారంభోత్సవానికి జాకేరు గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు, గ్రామ ప్రజలతో కలిసి బడి బస్సును అరటి చెట్లు, పూల దండలతో అందంగా అలంకరించారు. బస్సు ఏర్పాటు చేసినందుకు డిపో మేనేజర్‌కు, సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రిక్కి అప్పారావుకు పూలమాల వేసి దుస్సాలువతో సత్కరించారు. బడి బస్సు ఆ రూట్లలో ఆయా గ్రామాలకు చేరేసరికి గ్రామాలలో గల గ్రామ ప్రజలు, విద్యార్థులు బస్సు రాకను చూసి ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఐ వెంకట్రావు, ఐటిడిపి మండల అధ్యక్షులు సేనాపతి గణేష్, జగ్గయ్యపేట వైస్ సర్పంచ్ వంటాకుల శ్రీను, మండల తెలుగు యువత అధ్యక్షులు సిరికి రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఆర్‌టిసి డిపో సిబ్బంది పాల్గొన్నారు.

బడి బస్సును ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

పాఠశాల నైట్ వాచ్‌మెన్‌ల ధర్నా

ప్రజాశక్తి- రేగిడి

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను పరిరక్షించేందుకు నైట్‌వాచ్ మెన్‌లను గత ప్రభుత్వం నియమించింది. కానీ నాలుగు నెలలుగా వారికి జీతభత్యాలు లేక ఆకలితో అలమటిస్తున్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలు విడుదల చేయాలని, ఇస్తున్న అరకొర జీతాలు పెంచాలని కోరుతూ ఎంపిడిఒ కార్యాలయం వద్ద శాంతియు తంగా సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా నైట్ వాచ్‌మెన్ సంఘ ప్రతినిధులు కెంబూరు శ్రీనివాసరావు, ఎస్.సురేష్, టి.సత్యం, కరణం అప్పలనాయుడు, మామిడి గణపతిలు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఉన్నత పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నామని అన్నారు. సాయంత్రం నాలుగు గంటల నుండి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

నమస్కరించి ధర్నా చేస్తున్న వాచ్‌మెన్‌లు

పాఠశాలలకు కాపలాదారులుగా అన్ని రకాల ఇబ్బందులున్నా విధులు నిర్వహిస్తున్నామన్నారు. గత నాలుగు నెలలుగా ప్రభుత్వం నుండి జీతభత్యాలు లేక తమ కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయని చెప్పారు. నెలవారి జీతభత్యాలు రూ.6వేలు ఇస్తుం దని, కనీస అవసరాలకు, కుటుంబ పోషణకు చాలడం లేదని జీతాలు పెంచాలని కోరారు. జిల్లాలో వ్యాప్తంగా వాచ్‌మెన్‌ల పరిస్థితి ఇలాగే ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీతాలు పెంచి పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అనంతరం ఎంపిడిఒకు శ్యామలకుమారికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ ఉన్నతాధికారులకు నివేదిస్తానని జీతభత్యాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నేరాలు ఘోరాలు

స్నానాల గదిలో వీడియో చిత్రీకరించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- కంటోన్మెట్

నగరానికి చెందిన ఒక మహిళ స్నానం చేస్తుండగా వీడియో చిత్రీకరించేందుకు ప్రయత్నించి, ఆమె భర్తపై దాడికి పాల్పడిన కేసులో పట్టణానికి చెందిన నిందితుడు పోలాకి గౌరి శంకర్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. జూలై 4న స్నానం చేస్తున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన పోలాకి గౌరి శంకర్ వీడియో చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. ఆమె గమనించి కేకలు వేయగా, అతడు పరారీ అయ్యాడు. ఈ విషయం ఆమె భర్తకు తెలపగా, భర్త అతడిని పట్టుకొని, మొబైల్ తీసుకున్నాడు. ఈ సందర్భంగా అతనిపై నిందితుడు దాడి చేసి మొబైలు పట్టుకొని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం అరెస్టు చేసి అతని వద్ద నుండి మొబైల్ సీజ్ చేసి, రిమాండుకు తరలించినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు.

గంజాయి కేసులో నిందితులకు నాలుగేళ్ల జైలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రేగిడి ఆముదాలవలస పోలీసు స్టేషనులో 2023లో నమోదైన గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు నాలుగేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమాన విధిస్తూ శ్రీకాకుళం 1వ ఎడిజె జడ్జి పి.భాస్కరరావు సోమవారం తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. రేగిడి ఆముదాలవలస పోలీసు స్టేషను పరిధిలోని బూరాడ గ్రామ జంక్షను వద్ద పోలీసులు 2023 ఆగస్టు 7న వాహన తనిఖీలు చేపడుతుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వి.రాంబాబు (21)ను అదుపులోకి తీసుకొని, అతనివద్ద 1.8కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో రాంబాబు ఇచ్చిన సమాచారంతో మరో ఇద్దరు నిందితులు పి.వెంకటేష్ (22), పి.జీనా బందుస్ (24) ను అప్పటి రాజాం రూరల్ సిఐ ఉపేంద్ర అరెస్టు చేసి, వారి నుండి 4.8కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండుకు తరలించారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి పి. భాస్కరరావు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

బేబినాయన

ప్రజాశక్తి - బొబ్బిలి

నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన చెప్పారు. కోటలో సోమవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు పాడైపోవడంతో అసెంబ్లీ, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలలో, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులను కలిసినప్పుడు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరడంతో ప్రభుత్వం స్పందించి గొల్లపల్లి నుంచి కారాడ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4.50కోట్లు, ఆకులకట్ట నుంచి పినపెంకి రోడ్డుకు రూ.2.60కోట్లు మంజూరు చేసిందన్నారు. దీంతో టెండర్లు పూర్తి అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కారాడ నుంచి తెర్లాం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.8.50కోట్లతో ప్రతిపాదనలు చేసినట్లు చెప్పారు. గొర్లెసీతారాంపురం, పాతబొబ్బిలి వద్ద పాడైపోయిన రోడ్డును బాగు చేసేందుకు కలెక్టర్ అత్యవసర నిధులు మంజూరు చేస్తామని చెప్పారన్నారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పూల్‌బాగ్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.1.15కోట్లు బుడా నిధులను బుడా చైర్మన్ తెంటు రాజా ఇచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు.

బాలికల వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సోమవారం ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. బాలికల డార్మెటరీ, మరుగుదొడ్లను పరిశీలించారు. వసతి గృహం ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను వెదజల్లకుండా ఒకచోట గుట్టగా వేయాలని, వసతి గృహంలో ఏఏ పండ్ల మొక్కలు అవసరమో అడిగి తెలుసుకున్నారు. చదువుల్లో వసతి గృహం జిల్లాలో ప్రథమ స్థానం వచ్చే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. రెండు మూడు రోజుల్లో వసతి గృహం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ ఆదిలక్ష్మి, ఇంచార్జి ప్రిన్సిపాల్, మ్యాథ్స్, సైన్సు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లో పూడిక తీత పనులను ఎంపిడిఒ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం చుట్టూ పరిశుభ్రంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, కార్యకర్తలకు సూచించారు.

చంద్రబాబు మోసాలను వివరించండి

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

సిఎం చంద్రబాబు చేసిన అసత్య హామీలు ప్రజలకు వివరించాలని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బెల్లాన కన్వెన్షన్ హాల్లో వైసిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా నేటికీ ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో నెరవేర్చలేదన్నారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి, గత సంవత్స రంలో ఒక్క సిలిండర్‌నే కేటాయించిందని, పలు నిబంధనలతో కొంతమందికే పథకం పరిమితం చేసినప్పటికీ నేటికీ చాలామంది ఖాతాల్లో సబ్సిడీ డబ్బులు వెయ్యలేదని విమర్శిం చారు. అన్నదాతలు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా పథకానికి సుఖీభవ అనే పేరు మార్చిన రైతన్నలకు ఇస్తామన్న 20 వేల నగదును మాత్రం నేటికీ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ అబద్ధపు హామీలను ప్రజలకు అర్థమయ్యే విధంగా ప్రతి ఒక్కరూ ఈనెల 12వ తేదీ జరగబోయే మండల స్థాయి విస్తృత సమావేశం తర్వాత ఇంటింటి ప్రచారం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి గార తవుడు, వైసిపి నాయకులు రాజేశ్వరి, సరయు, ప్రకాష్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు జైహింద్, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరమణ, ఐదు మండలాల ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

విద్యార్థినులకు ఉచిత సైకిళ్లు పంపిణీ

బాడంగి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వికె యూనివర్సిల్ ఫ్యామిలీ ఫౌండేషన్, క్రేజీబి ఫైనాన్సియల్ సర్వీసెస్ ప్రవేట్ లిమిటెడ్ సంయుక్తంగా జిల్లాలో గల వివిధ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ విద్యార్థినిలకు ఉచితంగా రూ.5లక్షల విలువ గల 70 సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సైకిళ్లను జెడ్‌పిటిసి రామారావు, ఎంపిటిసి డి.శ్రీనివాసరావు, సర్పంచ్ కె.రమేష్, హెచ్‌ఎమ్ డి సత్యనారాయణ, వికె ట్రస్టు ప్రతినిది సానా సత్యకుమార్ చేతుల మీదుగా విద్యార్థినిలకు అందించారు. ఈ సందర్భంగా వికె ట్రస్ట్ ప్రతినిది మాట్లాడుతూ బాలికా విద్యను ప్రోత్సహించడంలో భాగంగా అమ్మానాన్న లేని విద్యార్థులకు ఆసరాగా వికె ట్రస్టు, క్రేజీబి ఫైనాన్సియల్ సర్వీసెస్ లిమిటెడ్ సంయుక్తంగా సైకిళ్లను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రాజేశ్వరి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

10న గురు పౌర్ణమికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈనెల 10న గురు పౌర్ణమి సందర్భంగా నగరంలోని రింగ్‌రోడ్డులోగల సింహాద్రినగర్ షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు షిర్డీ సాయిబాబా సేవా సమాజం అధ్యక్షులు కరణం జనార్ధన్ రావు తెలిపారు. సోమవారం స్థానిక ఆలయంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 6.15 నిమిషాలకు మూలవిరాట్ కు అభిషేకాలు, 7:30కు అష్టోత్తర పూజా కార్యక్రమం, 10 గంటలకు భిక్ష, 11:30గంటలకు దుని పూజా కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు హారతి, 12 గంటల రెండు నిమిషాలకు నారాయణ సేవ, 3వేల మందికి అన్నదానం, సాయంత్రం 6:15 నిమిషాలకు హారతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6.45నిమిషాలకు బాబాపల్లకి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. 9గంటలకు సేవా భారతి అనంతరం ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు గురు పౌర్ణమి రోజున బాబాను దర్శించుకోవాలని కోరారు.

మహారాజశ్రీ చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

IA 801/24, IA802/24, IA 804/2024

OS 91/2018

బిట్వీన్ :-
పేరిచర్ల సీతారామరాజు ....పిటీషనర్/వాది
ఎండ్ :-
ఎల్లంటి అప్పమ్మ వగైరాలు
......రెస్పాండెంట్స్/ప్రతివాదులు

నోటీసు

To
R6. ఇజ్జిరోతు సరస్వతి, W/o సత్యం, వంగపల్లిపేట గ్రామం, చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా.

పైన పేర్కొన్న వాది మీపై పిటిషన్స్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ మీ హాజరు నిమిత్తం **తే 11-07-2025దీ**న వాయిదా అయి ఉన్నది. కనుక ఆ దినం **ఉదయం 10-30 గం॥**లకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ సదరు కోర్టులో హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనిచో మీ పరోక్షంన విచారించి తీర్మానించబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

బెల్లాన రవి
అడ్వకేట్,
విజయనగరం